క్లుప్తంగా

శివ్వంపేట బగలాముఖీ శక్తిపీఠంలో పూజలు



హోమం నిర్వహిస్తున్న పండితుడు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో శనివారం పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. బగలాముఖీ ఉపాసకుడు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహామంత్ర హవనం, హరిద్వార్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం హైదరాబాదు గొలిగూడకు చెందిన శారదపరమేశ్వర్ దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు.

శనేశ్వరాలయంలో శిఖర ప్రతిష్ఠ పూజలు



శనేశ్వరాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని శనేశ్వరాలయంలో శిఖర ప్రతిష్ఠ, భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం 31వ వార్షికోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు ఉమాశంకరశర్మ, రవిప్రసాద్‌శర్మ, మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో గోపూజ, గురుపూజ, గణపతిపూజ, జలాధివాసం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వన దుర్గమ్మ సేవలో ఆర్డీఓ దంపతులు



దుర్గమ్మకు పూజలు చేస్తున్న ఆర్డీఓ దంపతులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వనదుర్గమ్మను శనివారం మెదక్ ఆర్డీఓ రమాదేవి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయానికి వచ్చిన వారికి అర్చకులు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి, శాలువాతో సత్కరించారు.

ఘనంగా బండ్ల ఊరేగింపు



బండ్ల ఊరేగింపులో భక్తులు

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని కుర్తివాడ మత్తడి పోచమ్మ జాతరలో భాగంగా శనివారం బండ్లను ఊరేగించారు. కొబ్బరి మట్టలు, మామిడి కొమ్మలు, చీరలతో అలంకరించిన ఎడ్లబండ్లను ఆలయం చుట్టూ తిప్పారు. చుట్టు పక్కల గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వ్రత శోభితం.. భక్తజన పరవశం



వ్రతమాచరిస్తున్న దంపతులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి శ్రీలక్ష్మీనృసింహుడి క్షేత్రం శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలతో అలరారింది. ఉమ్మడి మెదక్‌జిల్లా, హైదరాబాద్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. హరిద్రలో పుణ్యస్నానాలాచరించిన దంపతులు సామూహిక వ్రతాలు ఆచరించారు. 34 వ్రతాలు జరిగినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. హనుమాన్ జయంత్యోత్సవంలో భాగంగా నాచగిరి శ్రీరామాంజనేయ ఆలయంలో విశేష పూజలు జరిగాయి.

అందినట్టే అంది.. చేజారిన పంట

భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లన్ని వట్టిపోతున్నాయి. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరిపంట చేతికి వచ్చేలా లేదు. పదిహేను రోజుల్లో కోతకు వచ్చిన వరిపంటకు నీరందకపోవడంతో ఎండిపోతోంది. మండల కేంద్రంలోని చౌరస్తా ప్రాంతంలో రైతులు సాగుచేసిన వరి పంటలన్నీ పొట్టదశ నుంచి విత్తనదశకు వచ్చాయి. కోతకోసే సమయంలో నీరందడం లేదు. దీంతో రైతులు దిక్కుతోచక కన్నీరుమున్నిరవుతూ పశువులకు మేతగా కోసేస్తున్నారు. పెట్టుబడులు పూర్తిగా మీదపడి కుటుంబ పోషణ భారమవుతోందని తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

– టేక్మాల్(మెదక్)



పశువులకు మేతగా వదిలేసిన పంట



నీరందక ఎండిపోయిన వరిపొలం

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



కొల్చారంలో శోభాయాత్ర



పాపన్నపేట(మెదక్): కుర్తివాడలో ..



నార్సింగి మండలం శేరిపల్లిలో..

జిల్లా వ్యాప్తంగా శనివారం హనుమాన్ విజయోత్సవ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామగ్రామాన ఆలయాల్లో హనుమంతుడికి చందనం, తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యువకులు, నాయకులు, గ్రామస్తులు శోభయాత్ర చేశారు.



తూప్రాన్: వీరాంజనేయస్వామి ఆలయం వద్ద సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



పెద్దశంకరంపేటలో..



మనోహరాబాద్‌లో బైక్ ర్యాలీ



చేగుంటలో హనుమాన్ శోభాయాత్ర



రామాయంపేటలో..

కనుల పండువగా గరుడ సేవ



గరుడసేవ మహోత్సవంలో భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన పురాతన కోదండరామస్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గరుడ సేవ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఏటా నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా స్వామివారి గరుడ రథోత్సవం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. గ్రామస్తులు హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బాలయ్య

చేగుంట(తూప్రాన్): బైక్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన కత్తెర బాలయ్య(50) ద్విచక్ర వాహనంపై దౌల్తాబాద్ మండలం మాందాపూర్‌లోని బంధువుల ఇంటికి శుక్రవారం వెళ్తుండగా, చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో స్పీడ్ బ్రేకర్ వద్ద బైకు అదుపుతప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయాలైన అతన్ని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. అతడి సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయులకు స్పోర్ట్స్ మీట్

నర్సాపూర్: టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నర్సాపూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు స్పోర్ట్స్ మీట్ నిర్వహించినట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో క్రీడా పోటీలు రెండు రోజుల పాటు నిర్వహిస్తామని చెప్పారు. ఉపాధ్యాయులకు షాట్‌పుట్, రన్నింగ్ పోటీలు, 13న క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఆటల పోటీలతో మానసిక ఉల్లాసం, శారీరకంగా ఫిట్‌నెస్ పొందవచ్చన్నారు. తమ యూనియన్ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.

కడుపు నిండా అన్నం.. కంటి నిండా నిద్ర

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

కొండపాక(గజ్వేల్): పేదలు కడుపు నిండా అన్నం.. కంటి నిండా సక్రమంగా నిద్రపోయేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో రేషన్‌కార్డు ద్వారా సన్నబియ్యం పొందిన ఓ లబ్ధిదారుడి ఇంట్లో శనివారం భోజనం చేశారు. సన్నబియ్యం పథకం ఎలా ఉందంటూ లబ్ధిదారులను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా కూడా సన్నబియ్యం పంపిణీ దోహదపడుతుందన్నారు. గ్రామంలో ఎస్సీ కాలనీ సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ భూంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, మహేందర్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కనకయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న నర్సారెడ్డి

నేడు గొర్రెల కాపరుల సంఘం మహాసభ

రామాయంపేట(మెదక్): యాదగిరిగుట్టలో ఈనెల 13న జరుగనున్న గొర్రెల కాపరుల సంఘం నాలుగవ మహా సభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరాజు విజ్ఞప్తి చేశారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెల కాపరులకు రావాల్సిన బకాయిలను పోరాడి సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో ఈమహాసభకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రశాఖ అధ్యక్షుడు శ్రీహరి యాదవ్‌తో పాటు రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు ఈమహాసభకు హాజరవుతారని దేవరాజ్ అన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



శివ్వంపేట(నర్సాపూర్): ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా తనవంతు సహాయం చేస్తున్నట్టు మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అన్నారు. శనివారం మండల కేంద్రం శివ్వంపేటలో పలు వార్డుల్లో తన సొంత నిధులతో కొత్త సింగిల్ ఫేజ్ మోటార్‌తో పాటు మరో మోటార్‌కు మరమ్మతులు చేయించి, బోరుబావుల్లో దింపి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పోచగౌడ్, లక్ష్మీనర్సయ్య, కొండల్, అశోక్, రమేశ్‌గుప్తా, వెంకటేష్, కృష్ణ, బాలరాం, అర్జున్ తదితరులు ఉన్నారు.

◆ ఉచిత మినరల్‌వాటర్ ప్రారంభం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ ఎర్రం అశోక్ ఆధ్వర్యంలో ఉచిత మినరల్ వాటర్ కేంద్రం ప్రారంభించారు. శనివారం ఉచిత వాటర్ కేంద్రాన్ని తన తల్లిదండ్రులు ఎర్రం అన్నమ్మ–గుండయ్య, సరళ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసినట్లు అశోక్ ప్రకటించారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేశంగౌడ్, చంద్రశేఖర్, నరేశ్, సోమరాజు, ఆర్యవైశ్య సంఘం నాయకులు వెంకటేశం, శ్రీనివాస్, ఆనంద్, అమర్ పాల్గొన్నారు.

◆ మహిళలకు అధిక ప్రాధాన్యం

నర్సాపూర్: ప్రజా ప్రభుత్వంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శనివారం ఆయన పలువురు పార్టీ నాయకులతో కలిసి పట్టణంలోని జగన్నాథరావు కాలనీలోని ముస్లిం సామాజిక వర్గానికి చెందిన సన్నబియ్యం లబ్ధిదారుడు మక్బూల్ ఇంట్లో శనివారం తమ పార్టీ నాయకులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు మల్లేశ్, చిన్న ఆంజిగౌడ్, సుధీర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, పీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో 23 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, నాయకులు నవీన్ గుప్తా, కరుణాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆరోపణలు అర్థరహితం

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): రాజ్యాంగంపై బీజేపీ చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రామోజిపల్లి, జూకల్, వీరోజీపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్నజైబాపు–జైభీమ్–జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఇన్‌చార్జి ధనలక్ష్మితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రామోజిపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవాని, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధు, నాయకులు నారాగౌడ్, సంగమేశ్వర్, మాజీ ఎంపీపీ రాజు, ఆర్ఎన్.సంతోష్, కుంట్ల రాములు, పెరుమాండ్లగౌడ్, చందర్, అశోక్, అనంతరావు, ప్రకాష్, రాజుగౌడ్ ఉన్నారు.



రామోజిపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని వల్లూర్ గ్రామంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను నిర్వహించారు. శనివారం వల్లూర్ గ్రామంలో జైబాపు–జైభీమ్–జై సంవిధాన్ యోజనలో భాగంగా కాంగ్రెస్ ఇన్‌చార్జి రాజాగౌడ్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, మండల నాయకులు రాజేశ్, శ్రీనివాస్ రెడ్డి, బాచి, శ్రీధర్‌రెడ్డి, సుధాకర్, వల్లూర్ గ్రామ నాయకులు వినోద్, స్వామి పాల్గొన్నారు.

ఫైజాబాద్‌లో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని ఫైజాబాద్, బండపోతుగళ్, అజ్జమర్రి గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డితో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పాండరి, నాయకులు విశ్వాంబరస్వామి, సుధీర్‌రెడ్డి, దుర్గాచలం, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అందరూ భక్తిమార్గంలో నడవాలి

తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు రెండు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం నుంచే పూజలు, హోమాలు చేశారు. తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి ముఖ్య అతిథిగా విచ్చేసి విగ్రహాల ప్రతిష్ఠాపన వేదపండితులతో కలిసి నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భగవంతుడికి ఎంతో సేవ చేయాలని సూచించారు. ఆలయాల్లో నిత్యం పూజలు చేసి నైవేద్యం సమర్పించాలని తెలిపారు. విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి విచ్చేసిన భక్తులతో ఆలయం ప్రాంతం కిటకిటలాడింది. కాగా జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్, అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌లు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు విఠల్‌రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, వట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్ శ్రీధర్ గుప్తా, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు బుచ్చయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్‌లు శ్యాంరావు కులకర్ణి, రాధకిషన్, మాజీ ఎంపీటీసీ గొల్ల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మాజీ ఎంపీ బీబీ పాటిల్

ప్రమాదకరంగా నడిరోడ్డుపై గుంత



రోడ్డుపై ఏర్పడిన గుంత

టేక్మాల్(మెదక్): మండలంలోని కాద్లూర్ ఎస్సీ కాలనీలో నడిరోడ్డుపై గుంత ఏర్పడింది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాల్వపై ఉన్న పైకప్పు పెచ్చులూడడంతో వాహనాల రాకపోకలకు బారీ గుంత ఏర్పడింది. పైకప్పు రోజురోజుకు భారీగా మారి, ప్రమాదకరంగా మారింది. దీంతో కాస్త ఆదమరిచి అటువైపు వెళ్లినా ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో కాలనీలోని రోడ్డుగుండా వెళ్లాలంటే ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు ఆడుతూ వెళ్తూ ఎన్నోసార్లు గుంతలో పడి ప్రమాదాలు జరిగి ఆస్పత్రుల పాలయ్యారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా.. వారు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, మురుగు కాల్వపై వేసిన పైకప్పును మూసి వేయాలని కోరుతున్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

చేగుంట(తూప్రాన్): మండలంలోని పెద్దశివునూర్ గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ ఫీల్డ్ ఆఫీసర్ సుజాత మాట్లాడుతూ.. ఉపాధిహామీ కూలీలకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. తక్కువ సమయంలో పండే పంటలకు రైతులు ప్రాధాన్యతను ఇస్తున్నారని తెలిపారు. అయితే రైతులు దీర్ఘకాలికంగా ఆదాయం పొందాలంటే, ఆయిల్ పామ్ పంటలు ఉత్తమ మార్గమని వివరించారు. ఆయిల్‌పామ్ పంటలకోసం ప్రభుత్వం డ్రిప్ సబ్సిడీపై అందిస్తున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాల్లో ఈ పంట వేసుకొని రైతులు ఎక్కువ కాలం ఆదాయం పొందేలా ఆలోచించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శోభ, గ్రామ రైతులు పాల్గొన్నారు.



పెద్దశివునూర్‌లో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న సుజాత

నర్సన్ చెరువును తవ్వేస్తున్న అక్రమార్కులు



నారాయణపూర్ నర్సన్ చెరువులో అక్రమార్కులు ఇసుక కోసం తీసిన గోతులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని నారాయణపూర్ నర్సన్ చెరువును ఇసుక అక్రమార్కులు తవ్వేస్తున్నారు. కొన్ని రోజులుగా రాత్రి వేళలో గ్రామానికి చెందిన కొంతమంది జేసీబీలతో పెద్ద పెద్ద గోతులు తీస్తూ ట్రాక్టర్ల ద్వారా పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కొరవడంతో అక్రమ ఇసుక రవాణాదారులకు అడ్డు అదుపు లేకుండా పోతుందని గ్రామస్తులు, నర్సన్ చెరువు ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులకు రైతులు, గ్రామ కార్యదర్శి కలిసి విన్నవించినా.. పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయమై ఇరిగేషన్ శాఖ ఏఈ మణిభూషణ్‌ను వివరణ కోరగా.. తమ దృష్టికి వచ్చిందన్నారు. నర్సన్ చెరువుతో పాటు మండలంలోని ఇతర చెరువులు, కుంటలు, వాగుల నుంచి అక్రమార్కులు రాత్రి సమయంలో ఇసుక తీస్తున్నారు. దీంతో వారిని పట్టుకోవడం సాధ్యం కావడం లేదన్నారు.

వ్రత శోభితం.. భక్తజన పారవశ్యం

వర్గల్(గజ్వేల్): నాచగిరి లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. ఉమ్మడి మెదక్‌జిల్లా, హైదరాబాద్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. హరిద్రలో పుణ్యస్నానాలు చేసి సామూహిక వ్రతాలు ఆచరించారు. 34 వ్రతాలు జరిగినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.



వ్రతమాచరిస్తున్న దంపతులు